


ఉష్ణోగ్రత (అంచనా)

16-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	34	28
తెనాలి	34	28
నరసరావుపేట	34	27
బాపట్ల	36	28
రెంటచింతల	34	27
చీరాల	36	28

చినుకు రాలదాయె!

- 59 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- పంటల సాగు తడబాటు
- తొలకరి కోసం రైతుల ఎదురు చూపులు
- సాగుకు సిద్ధం చేసిన భూములు
- ఆందోళనలో అన్నదాతలు

మూడు జిల్లాల్లో పంటల సాగు ఇలా..

మూడు జిల్లాల్లో వరి, పత్తి, మిరప, కంది, పొగాకు విస్తృతంగా సాగు చేస్తారు. ప్రధాన పంటల సాగుకు వాతావరణం అనుకూలించడం లేదు. మెట్ట పైర్లు సాగుకు పొలాలను రైతులు దుక్కి చేసుకున్నారు. వరి సాగు కోసం దుక్కులు దున్నేందుకు సాహసం చేయడం లేదు. వర్షాభావం ఇలానే కొనసాగితే సాగుకు గడ్డు కాలమేనన్న అందోళన అన్నదాతల నుంచి వ్యక్తమవుతోంది.

మేరికపూడి ప్రాంతంలో విత్తనం విత్తేందుకు అచ్చు తొలుతున్న రైతు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మూడు జిల్లాల్లోని 59 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. పల్నాడు జిల్లాలో 28 మండలాలకు గాను ఒక్క మాచర్లలో మాత్రమే అత్యధిక వర్షపాతం నమోదైంది. 16 మండలాల్లో అత్యధిక లోటు, 8 మండలాల్లో లోటు, మూడు మండలాల్లో సాధా రణ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో 40 మి.మీ సాధారణ వర్ష పాతం నమోదు కావాలి. అయితే ఇప్పటికి 18.2 మి.మీ వర్షపాతం నమో దైనట్లు వాతావరణ (మిగతా 7వ పేజీలో)

రోహిణిలో ఊరించిన వర్షాలు.. మృగశిరలో ముఖం చాటేశాయి. మృగశిరకు స్వాగతం పలుకుతూ అన్నదాతలు కోటి ఆశలతో ఉత్సా హంగా ఏరువాక సాగారు. పొలాలను దుక్కులు దున్ని సాగుకు సమాయత్త మయ్యారు. కానీ, చినుకు రాలక పోతుండటంతో ఆందోళన చెందు తున్నారు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నా రు. వర్షాలు కురవక పోవడంతో పంటల సాగు జాప్యం అయ్యే పరిస్థితులు ఏర్ప డ్డాయి. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవడం, ప్రాజెక్టులు నిండటంతో పంట లను విస్తృతంగా రైతులు సాగు చేశారు. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అక్కడక్కడ చిరు జల్లులు తప్పా పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురవలేదు.



నిరుపయోగంగా మాంసం, చేపల మార్కెట్‌లోని షాపులు

అక్కడ షాపులు.. ఇక్కడ కోతలు

- మాంసం, చేపల మార్కెట్ నిరుపయోగం
- ఐదేళ్లూ వైసీపీ, ఏడాదిగా కూటమి నిర్లక్ష్యం
- రోడ్లపైనే మాంసపు విక్రయాలు, ప్రజలకు ఇక్కట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రం నరసరావుపేటలో అన్ని వసతులతో రూ. 7 కోట్లు వెచ్చించి మాంసం, చేపల మార్కెట్‌ను మున్సిపాలిటీ నిర్మించింది. ఐదేళ్లూ వైసీపీ, ఏడాదిగా కూటమి పాలనలో ఈ దుకాణాలను నిరుపయోగంగా మార్చారు. షాపులు ఉన్నా రోడ్లపైనే వ్యాపారులు మాంసం, చేపలు విక్రయిస్తు



పల్నాడు రోడ్డులో మాంసం విక్రయాలు

న్నారు. అక్కడే జంతు వధ చేస్తుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వీటిని నిరోధించడంలో మున్సిపాలిటీ అధికారులు చోద్యం చూస్తున్నారు. రోడ్లపై మాంసం విక్రయాలను అరికట్టాలని కోరుతున్నా.. వారి మొర ఆలకించే పరిస్థితి లేదు. మాంసం, చేపల మార్కెట్ వినియోగంలోకి వస్తే మున్సిపాలిటీకి ఆదాయంతో పాటు ప్రజలకూ ఇబ్బందులు తీరుతాయి. మార్కెట్ విషయంలో పురపాలిక నిర్లక్ష్యం ఏటా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోయేలా చేస్తోంది. రూ.కోట్లు కుమ్మరించి కట్టిన దుకాణాలు నిరుపయోగంగా మారాయి. వీటిని వినియోగంలోకి తీసుకురావడంలో వైసీపీ బాటలోనే కూటమి కూడా పయనిస్తోందన్న విమర్శలు పట్టణవాసుల నుంచి వ్యక్తమవుతోంది.

4,500 మందికి స్థానచలనం

- ముగిసిన ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్
- బదిలీల్లో మున్సిపల్ ఉపాధ్యాయులకు షాక్!
- మున్సిపల్, కార్పొరేషన్ స్కూళ్లలో 200 మంది మిగులు

విద్యాశాఖ కొరడా!

- విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలు నిరాకరణ
- గుంటూరులో 70 ప్రైవేట్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు
- ప్రభుత్వానికి నివేదిక

డయేరియా రహిత సమాజాన్ని సాధిద్దాం

- ప్రచార గోడ ప్రతిని ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

నేటి నుంచి చేపల వేట ప్రారంభం

- ముగిసిన విరామం.. బోట్లు సిద్ధం

7

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు

- ఏఎంసీలలో కొత్త లైసెన్సులకు సవరణ
- దాదాపు రెట్టింపు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్షకు పెంపు
- పంట ఉత్పత్తులన్నీ ఒకే కేటగిరిలోకి తెచ్చిన మార్కెటింగ్ శాఖ

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఇక నుంచి కొత్త లైసెన్సులు పొందాలంటే బ్యాంక్ గ్యారెంటీలు ఎక్కువ మొత్తంలో నివేదించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న వాటిని రెట్టింపు చేస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ఏఎంసీలకు చేరాయి. గతంలో పండ్లు, కూరగాయలకు కలిపి ఒకే కేటగిరి చార్జీలు ఉండేవి. అలానే ఇతర పంట ఉత్పత్తులకు బ్యాంకు గ్యారెంటీలు ఎక్కువ మొత్తంలో ఉండేవి. ఇప్పుడు కూరగాయలు, పండ్లు ఇతర పంట ఉత్పత్తులు అన్న వ్యత్యాసం లేకుండా అన్నింటినీ ఒకే కేటగిరి కిందకు తీసుకొచ్చి బ్యాంకు గ్యారెంటీలను ప్రభుత్వం సవరించింది. దీని వల్ల రేపటి రోజున లైసెన్సుదారు మోసానికి పాల్పడినా బ్యాంకు గ్యారెంటీని సీజ్ చేసి, రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు సంబంధిత ఏఎంసీలకు వెసులుబాటు కలుగుతుంది.

కొత్తగా బ్యాంకు గ్యారెంటీలు ఇలా..

ఏఎంసీలలో చివరిసారిగా 2000 నవంబరులో బ్యాంకు గ్యారెంటీలను జీవో నంబరు 85 ద్వారా అప్పటి ప్రభుత్వం సవరించింది. వాటిని ఇప్పుడు పునఃసమీక్షించి సవరణలు చేస్తూ జీవో నంబరు 21 అమలులోకి తీసుకొచ్చింది. గతంలో కూరగాయలు, పండ్లకు టర్నోవర్ రూ.కోటి లోపు ఉంటే రూ.50 వేలు, రూ.కోటి నుంచి (మిగతా 7వ పేజీలో)

ఉన్నట్టా.. లేనట్టా!?



- వ్యవసాయ శాఖలో బదిలీల గందరగోళం
- జీఓ విడుదలై వారం దాటినా రిలీవ్ చేయని వైనం
- తలలు పట్టుకుంటున్న డీడీఏ, ఏడీఏలు
- ఒకరిద్దరి కోసం అందరితో ఆటలు

జోన్ -3లో పెద్దగా ఇబ్బందులు లేకున్నా..

గుంటూరు సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో బదిలీల వ్యవహారం గందర గోళంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు అధికారులను బదిలీ చేస్తున్నట్లు గత వారం ప్రభుత్వం జీవో విడుదల చేసినా దాన్ని అమలు పరచక పోవడం చర్చనీయాంశంగా మారింది. అసలు ఎందుకు రిలీవ్ చేయడం లేదో అర్థం కాక చాలా మంది అధికారులు టెన్షన్‌తో తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలో బదిలీల కోసమని ప్రభుత్వం విధించిన గడువు కూడా ముగిసింది. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య బదిలీల సందర్భంలో మొదలైన గిల్లికజ్జాలకు మాత్రం ఫులుస్టాప్ పడకపోవడం అధికారుల పాలిట శాపంగా మారినట్లు చెబుతున్నారు.



బదిలీ జీవోను పక్కన పెట్టించడానికి ప్రధాన కారణం జోన్ - 1, 2లో జరిగిన పొరపాట్లు అని తెలుస్తోంది. అయితే జోన్-3 కిందకు వచ్చే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అటువంటివి జరగలేదన్నది అధికారుల వాదన. ఒకరిద్దరి కోసం అందరినీ ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 30 మంది

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 30 మంది వ్యవసాయ అధికారుల బదిలీ వ్యవహారం ఎటూ తేలకుండా ఉంది. వారిలో పలువురు డీడీఏలు, ఏడీఏలు ఉన్నారు. బదిలీ జీఓ విడుదలైన ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత (మిగతా 7వ పేజీలో)

విజయవాడ వెస్ట్ బైపాస్ ఇంకెప్పుడు

- పూర్తి కాని టోల్ గేటు నిర్మాణం



- జూన్ నుంచి అందుబాటులోకని తొలుత అంచనా
- ఈ రోజు వరకూ పూర్తి కాని నిర్మాణం
- మరో మూడు నెలలు వేచి చూడాల్సిన పరిస్థితి
- చినకాకాని, కృష్ణాయపాలెం, మందడం, గొల్లపూడి వద్ద పెండింగు పనులు

గుంటూరు, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): రాజధాని అమరావతి కనెక్టివిటీలో కీలకమైన విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యేలా కన్పించడం లేదు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ బైపాస్ అందుబాటులోకి వస్తుందని విస్తృ తంగా ప్రచారం జరిగింది. అయితే తాజా పరిస్థితులను బట్టి మరో మూడు నెలల వరకూ అందు బాటులోకి వచ్చే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.

విజయవాడ ట్రాఫిక్ నియంత్రణలో కీలకం

ప్రస్తుత ఎన్టీఆర్, ఏలూరు, తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాలను రాజధానితో అనుసంధానించడంలో విజయవాడ వెస్ట్ బైపాస్ అత్యంత ప్రధానమైంది. ఈ బైపాస్ ప్యాకేజీ 4ను ఎన్టీఆర్ జిల్లా చిన్న అవుటుపల్లి నుంచి మంగళగిరి మండలం చినకాకాని వరకు విజయవాడకు పశ్చిమంగా నిర్మిస్తున్నారు. రాజధానిలోని వెంకటపాలెం, మందడం, కృష్ణాయపాలెం, కురగల్లు మీదగా వెళ్తుంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ఆ నాలుగు జిల్లాల వారికి రాజధానితో కనెక్టివిటీ (మిగతా 7వ పేజీలో)

బర్లీ కొనుగోళ్ల భారం రాష్ట్ర ప్రభుత్వానిదే..!

- పొగాకు బోర్డు కార్పస్ ఫండ్ ఇచ్చేందుకు కేంద్ర మంత్రి గోయల్ ససేమిరా
- ఆ నిధి అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని వ్యాఖ్య
- మిన్నకుండిపోయిన రాష్ట్ర, జిల్లా ప్రజాప్రతినిధులు



సమీక్షలో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, మంత్రి టీజీ భరత్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హై డెన్సిటీ బర్లీ పొగాకు కొనుగోళ్ల భారం రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ గుంటూరు నగరంలో పొగాకు బోర్డు సందర్శన సందర్భంగా బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు కేంద్రం సాయాన్ని ప్రకటిస్తారని అంతా ఆశించారు. అయితే ఆయన బర్లీ పొగాకు ప్రస్తావన జోలికి పోలేదు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పాల్గొన్న ఈ సమీక్షలో ఒకరిద్దరు బర్లీ పొగాకు అంశాన్ని ప్రస్తావించారు. పొగాకు బోర్డు వేలం కేంద్రాల్లో పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ఒక శాతం ఫీజుని వసూలు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ వద్ద రూ.వందల కోట్ల నిధులు కార్పస్ ఫండ్ రూపంలో ఉన్నాయి. వాటి నుంచి కొంత మొత్తంలో నిధులను బర్లీ పొగాకు కొనుగోళ్లకు కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశంలో లేవనెత్తగా.. అందుకు కేంద్ర మంత్రి గోయల్ సున్నితంగా తిరస్కరించారు. పొగాకు బోర్డు కార్పస్ ఫండ్ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. దీంతో ఇక రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మార్కెట్ కమిటీల్లో బర్లీ పొగాకు కొనుగోళ్లను చేపట్టాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. రైతుల నుంచి 20 మిలియన్ కేజీల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలంటే కనీసం రూ.300 కోట్లు అవసరమవుతాయి. అందులో సగం రూ.150 కోట్లు బోర్డు నుంచి కేటాయించమని కోరినా మంత్రి నుంచి సానుకూల స్పందన రాలేదు.

ఎన్ఐడీ, ఇండస్ట్రియల్ పార్కులపై సమీక్ష..

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ) గురించి మంత్రి గోయల్ సమీక్ష చేశారు. అమరావతి రాజధానిలో సగల హంగులతో ఎన్ఐడీ భవనాల నిర్మాణం చాలా వరకు పూర్తయింది. విద్యార్థులకు తరగతులు కూడా నిర్వహిస్తున్నామని అధికారులు నివేదించడంతో.. మంత్రి గోయల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఐడీలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పైనా మంత్రి గోయల్ సమీక్షించారు. రాష్ట్రంలో నిర్మాణం జరుగుతున్న కృష్ణపట్నం పార్కు గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. దీని తర్వాత మరో మూడు ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉన్నతాధికారి ఎన్.యువరాజ్, టుబాకో బోర్డు ఈడీ విశ్వశ్రీ, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ, డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు, మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు, డీడీ దివాకర్ పాల్గొన్నారు.

దిక్సూచి



ఇండస్ట్రీ డిమాండ్లతోపాటు, కొత్త కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి మన దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలు ముందు ఉంటున్నాయి. అందులో భాగంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఇంటర్ డిసిప్లినరీ, కొత్త ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రారంభించిన కొత్త బ్రాంచ్‌లు ఏమిటో చూద్దాం.

ఇంజనీరింగ్‌లో కొత్త బ్రాంచ్‌లు

ఐఐటీల్లో

1. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అండ్ డేటా సైన్స్

ఏఐ అండ్ డేటా సైన్స్, డేటా సైన్స్ అండ్ ఏఐ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఏఐ ఇలా రకరకాల పేర్లతో లేదా కాంబినేషన్లతో హైదరాబాద్, గౌహతి, ఢిల్లీ, జోద్‌పూర్, పాట్నా ఐఐటీలు ఈ బ్రాంచీలను అందిస్తున్నాయి.

ఉద్యోగ అవకాశాలు: ఏఐఎంఎల్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, బిజినెస్ అనలిస్ట్, ఎన్ఎల్‌పీ ఇంజనీర్, కంప్యూటర్ విజన్ ఇంజనీర్‌గా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీల్లో అవకాశాలు: గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి టెక్ దిగ్గజాలతోపాటు, స్టార్టప్‌లు, ఫైనాన్స్(క్వాంటమ్ రోల్స్), హెల్త్ కేర్(ఏఐ డయాగ్నస్టిక్స్), ఈ కామర్స్ తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో ఐఐటీలు, ఎన్ఐటీల వంటి సంస్థల్లో చదివిన వారికి 12 నుంచి 30 లక్షలు. విదేశాల్లో అయితే 20 నుంచి 50 లక్షల వరకు ఉండొచ్చు.

భవిష్యత్తు: ఆటోమేషన్, రోబోటిక్స్ తదితరాల్లో ఏఐ కీలకంగా మారుతుంది. అలాగే జనరేటివ్ ఏఐ అంటే చాట్ జీపీటీ తరహా మోడల్స్ కారణంగా వీరికి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది.

2. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ మెకట్రానిక్స్

అలహాబాద్(ప్రయాగ్‌రాజ్), హైదరాబాద్, జోద్‌పూర్ ఐఐటీలు ఈ బ్రాంచ్‌ను అందిస్తున్నాయి.

అవకాశాలు: రోబోటిక్స్ ఇంజనీర్, ఆటోమేషన్ స్పెషలిస్ట్, కంట్రోల్ సిస్టమ్ ఇంజనీర్, డిఫెన్స్ అండ్ స్పేస్‌లో ఆర్ అండ్ డీలుగా పని చేయవచ్చు.

ఏయే కంపెనీలు: టెస్లా, ఫాక్స్‌కాన్ వంటి మాన్యుఫాక్చరింగ్, ఇస్రో, స్పేస్ ఎక్స్ వంటి అంతరిక్ష సంస్థలు, డీఆర్‌డీఓ వంటి రక్షణ సంస్థలు, సీమెన్స్, బోష్ వంటి ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో 8 నుంచి 20 లక్షలు. యూఎస్, జర్మనీ, జపాన్ వంటి విదేశాల్లోని రోబోటిక్స్ హబ్స్‌లో అయితే 20 నుంచి 60 లక్షలు.

భవిష్యత్తు: ఇండస్ట్రీ 4.0, స్మార్ట్ ఫ్యాక్టరీలు, అటానమస్ వెహికిల్స్ వంటివి వీరికి డిమాండ్‌ను తెస్తాయి.

3. రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ వెహికిల్(ఈవీ) ఇంజనీరింగ్

ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పేరుతో బాంబే ఐఐటీ, ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో ఢిల్లీ ఐఐటీ, సస్టయినబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో మద్రాస్ ఐఐటీ ఈ బ్రాంచ్‌లను అందిస్తున్నాయి.

అవకాశాలు: ఈవీ డిజైన్ ఇంజనీర్, సోలార్ విండ్ ఎనర్జీ కన్సల్టెంట్స్, బ్యాటరీ టెక్నాలజిస్ట్, సస్టయినబుల్ అనలిస్ట్ తదితర ఉద్యోగాలు ఉంటాయి.

ఏయే కంపెనీలు: టెస్లా, టాటా మోటార్స్, ఓలా ఎలక్ట్రిక్, అదానీ గ్రీన్, సీమెన్స్ గమేసా, ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్ట్‌లు తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో 6 నుంచి 18 లక్షలు. విదేశాల్లో ఇంకా చాలా ఎక్కువగా ఉంటుంది.

భవిష్యత్తు: 2030 సంవత్సరం వరకు 500 గిగా వాట్ పునరుత్పాదక ఇంధనాలను తయారు చేయాలని భారత దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఈవీ బూమ్ కూడా వీరికి పెద్ద ఎత్తున అవకాశాలను కల్పించనుంది.

4. మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (నానో టెక్నాలజీ, ఇతర స్మార్ట్ మెటీరియల్స్ కేంద్రంగా)

ఈ బ్రాంచ్‌ను కాన్పూర్, మద్రాస్, బాంబే ఐఐటీలు అందిస్తున్నాయి.

5. క్వాంటమ్ టెక్నాలజీ

క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీఎస్సీ డిగ్రీని మద్రాస్ ఐఐటీ అందిస్తుండగా, క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ఐఐటీ జోద్‌పూర్‌లో బ్రాంచ్ ఉంది.

అవకాశాలు: క్వాంటమ్ ఆల్గోరిథమ్ డెవలపర్, క్వాంటమ్ హార్డ్‌వేర్ ఇంజనీర్, క్రిప్టోగ్రఫీ రీసెర్చర్ వంటి ఉద్యోగాలు చేయవచ్చు.

ఏయే కంపెనీలు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి పరిశోధనశాలలు, ఐబీఎమ్, గూగుల్ క్వాంటమ్ ఏఐ వంటి పెద్ద టెక్ సంస్థలు, క్వాంటన్ ఎన్‌క్రిప్షన్ వంటి రక్షణ సంస్థల్లో పనిచేయవచ్చు.

జీతభత్యాలు: భారతదేశంలో రీసెర్చ్ స్టార్టప్స్‌లో 15 నుంచి 30 లక్షలు. విదేశాల్లో సుమారు లక్షన్నర డాలర్లు.

భవిష్యత్తు: ఈ రంగాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కంప్యూటింగ్, క్రిప్టోగ్రఫి, మెటీరియల్‌సైన్స్‌లు వేగంగా ఎదిగే అవకాశం ఉంది.

6. బయో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్

ఈ బ్రాంచ్‌లను ఢిల్లీ, బాంబే, కాన్పూర్, హైదరాబాద్‌ల్లోని ఐఐటీలు అందిస్తున్నాయి.

అవకాశాలు: మెడికల్ డివైజ్ డిజైనర్, బయో మెకానిక్స్ ఇంజనీర్, హెల్త్‌కేర్ ఏఐ స్పెషలిస్ట్

ఏయే కంపెనీలు: బయోకాన్- డాక్టర్ రెడ్డీస్ వంటి ఫార్మా కంపెనీలు, సీమెన్స్ హీల్ థిన్నర్స్ వంటి మెడ్‌టెక్ కంపెనీలు, ఎయిమ్స్, ఐసీఎంఆర్ వంటి పరిశోధన సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 6 నుంచి 15 లక్షలు. విదేశీ మెడికల్ హబ్స్‌లో ఇంకా ఎక్కువగా ఉంటుంది.

భవిష్యత్తు: పెరుగుతున్న జనాభా, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్ ఉత్పత్తుల కారణంగా వీరికి మంచి డిమాండ్ ఉంటుంది.

6. కంప్యూటేషనల్ ఇంజనీరింగ్(ఏఐ + మెకానిక్స్ డిజైన్)

ఈ బ్రాంచ్ హైదరాబాద్, గాంధీనగర్ ఐఐటీల్లో ఉంది.

7. ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఈవీ) అండ్ మొబిలిటీ ఇంజనీరింగ్

మద్రాస్ ఐఐటీలో మొబిలిటీ ఇంజనీరింగ్, ఢిల్లీ ఐఐటీలో ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ ఉంది

8. సైబర్ సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ

కాన్పూర్ ఐఐటీలో సైబర్ సెక్యూరిటీ, జోద్‌పూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్‌లు ఉన్నాయి.

అవకాశాలు: ఎథికల్ హ్యాకర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, థ్రెట్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్, బ్లాక్‌చైన్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ తదితరాలు పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలు, సెర్ట్ ఇన్ వంటి రక్షణ సంస్థలు, పేటీఎమ్-రాజోర్ పే వంటి ఫిన్‌టెక్ కంపెనీలు, పాలో ఆల్టో - క్రౌడ్ స్ట్రైక్ వంటి గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ సంస్థల్లో పనిచేయవచ్చు.

జీతభత్యాలు: భారతదేశంలో 10 నుంచి 25 లక్షలు. విదేశాల్లో సుమారు లక్ష డాలర్లు.

భవిష్యత్తు: భవిష్యత్తు సైబర్ యుద్ధాలు జరిగే కాలం, 5జి క్లౌడ్ సెక్యూరిటీ అవసరాలు వీరి డిమాండ్‌ను బాగా పెంచుతాయి.

9. కాగ్నెటివ్ సైన్స్(హ్యూమన్-కంప్యూటర్ ఇంటరాక్షన్, ఏఐ+ సైకాలజీ)

గాంధీ నగర్, కాన్పూర్ ఐఐటీలో కాగ్నెటివ్ సైన్స్‌లో డ్యూయల్ డిగ్రీ కోర్సు ఉంది.

అవకాశాలు: యూఎక్స్‌యూఐ డిజైనర్, ఏఐ ఎథిస్ట్, న్యూరోసైన్స్ ఇంజనీర్(బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్) తదితరాలుగా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: టెక్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్ రీసర్చ్, మెటా, హెల్త్‌కేర్‌లో న్యూరో స్టార్టప్స్‌లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: యూఎక్స్ రోల్స్‌లో అయితే 10 నుంచి 25 లక్షలు. పరిశోధనలవైపు వెళితే ఇంకా ఎక్కువ ఉంటుంది.

భవిష్యత్తు: ఏఐ ఎథిక్స్, మెటావర్స్, ఏఆర్‌వీఆర్‌లో కాగ్నిటీవ్ సైన్స్ నిపుణుల అవసరం ఉంటుంది.

ఇంకొన్ని..



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), సైబర్ ఫిజికల్ సిస్టమ్స్

అవకాశాలు: ఐఓటీ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్, ఎంబెడెడ్ సిస్టమ్ ఇంజనీర్, స్మార్ట్ సిటీ కన్సల్టెంట్‌గా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: జియో, ఎయిర్‌టెల్ వంటి టెలీకామ్ కంపెనీల్లో, ఎల్అండ్ టీ, సీమెన్స్ వంటి స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఐవోటీ ఆధారిత ఫార్మింగ్ అగ్రిటెక్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 8 నుంచి 20 లక్షలు. గ్లోబల్ ఐటీ మార్కెట్ డిమాండ్ బాగా ఉంది.

భవిష్యత్తు: 5జీ బాగా పెరుగుతోంది. ఐఓటీ ఆధారంగా స్మార్ట్‌సిటీలు తయారవుతున్నాయి.

మెటీరియల్స్ సైన్స్ (స్మార్ట్ మెటీరియల్స్ నానో టెక్)

అవకాశాలు: నానోటెక్ రీసెర్చర్, కాంపోజిట్ మెటీరియల్స్ ఇంజనీర్, సెమీ కండక్టర్ మెటీరియల్స్ స్పెషలిస్ట్ తదితరాలుగా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: ఇంటెల్, టీఎస్ఎమ్‌సీ వంటి సెమీ కండక్టర్ కంపెనీల్లో, ఇస్రో, బోయింగ్ వంటి స్పేస్ సంస్థల్లో, ఈవీ బ్యాటరీ, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో విభాగాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 7 నుంచి 18 లక్షలు. విదేశీ పరిశోధక సంస్థల్లో చాలా ఎక్కుగా ఉంటుంది.

భవిష్యత్తు: చిప్స్, ఈవీలు, స్పెస్ టెక్నాలజీ బాగా పెరుగుతుండడంతో డిమాండ్‌కు తిరుగులేదు.

'క్రేజీ' ట్రెండ్స్

- ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ అనేవి ఇప్పుడున్న పాపులర్ ట్రెండ్స్
- పునరుత్పాదన ఇంధనాలు, ఈవీలపై అందరి దృష్టి ఉంది.
- క్వాంటమ్ టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ అనేవి అత్యంత డిమాండ్ ఉన్న రంగాలు.
- ఇప్పుడు సంప్రదాయ కోర్సులను ఇంటర్ డిసిప్లినరీ కోర్సులు రిప్లేస్ చేస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ + ఏ రంగం అయితే ఆ రంగానికి సంబంధించిన కోర్సు దీనికి చేరుతోంది.
- ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రవేశపెట్టిన ఈ కోర్సులకు ఉద్యోగ అవకాశాలు అత్యంత ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే టెక్నలాజికల్ అడ్వాన్స్‌మెంట్స్, ఇండస్ట్రీ అవసరాలతోపాటు, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, నేషనల్ ఏఐ స్ట్రాటజీ మొదలైన ప్రభుత్వ చొరవలకు అనుగుణంగా డిజైన్ చేసిన కోర్సులు ఇవి.

ఎన్ఐటీల్లో

- **ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్:** వరంగల్, తిరుచ్చి, సూరత్‌కల్, కాలికట్, పాట్నాల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఇంజనీరింగ్:** కురుక్షేత్ర, నాగపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **బయోటెక్నాలజీ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్:** రూర్కేలా, దుర్గాపూర్, వరంగల్‌లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.



- **మానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్ ఇండస్ట్రియల్ అండ్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి, జంషెడ్‌పూర్‌లోని ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- **మెకట్రానిక్స్ ఇంజనీరింగ్:** కాలికట్, పాట్నా ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **పెట్రోలియం ఇంజనీరింగ్, ఎనర్జీ ఇంజనీరింగ్:** కాలికట్, సూరత్‌కల్‌లోని ఎన్ఐటీల్లో ఉంది.
- **స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి ఎన్ఐటీలో సివిల్ విత్ స్మార్ట్ టెక్నాలజీ కోర్సు ఉంది.
- **సైబర్, ఫిజికల్ సిస్టమ్స్(ఏఐ+ఐఓటీ=రోబోటిక్స్):** ఆంధ్రప్రదేశ్, మణిపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఉంది.

ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్ (బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్స్)

- క్వాంటమ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌తో ఇంజనీరింగ్ ఫిజిక్స్. ఇది బొంబే, మద్రాస్ ఐఐటీల్లో ఉంది.
- మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్. అన్ని ఐఐటీలు, పేరున్న ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- ఎకనామిక్స్ అండ్ డేటా సైన్స్. కాన్పూర్, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో ఉంది.
- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ సస్టయినబిలిటీ. బాంబే ఐఐటీలో, తిరుచ్చి ఎన్ఐటీలో ఈ కోర్సు ఉంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అఖండ 2 కొత్త షెడ్యూల్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. 2021లో విడుదలై ఘనవిజయం సాధించిన 'అఖండ'కు ఇది సీక్వెల్. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమా కీలక షెడ్యూల్‌ను నేటి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభించనున్నట్లు తెలిపారు మేకర్స్. బాలకృష్ణతో సహా ప్రధాన పాత్రధారులందరూ పాల్గొననున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

'కన్నప్ప' చిత్రంపై ఆ శివుడి అనుగ్రహం ఉండాలి



మంచు విష్ణు కథానాయకుడిగా ముఖేష్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా కేరళలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో మోహన్‌లాల్ మాట్లాడుతూ "ఇప్పుడంతా పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది. 'కన్నప్ప' చిత్రం అద్భుతంగా వచ్చింది. ఆ శివుడి అనుగ్రహం ఈ సినిమాపై ఉండాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ "మోహన్‌లాల్ గొప్ప నటుడు. సినిమా కోసం ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా పారితోషికంగా తీసుకోలేదు. ఆయన చూపించిన ప్రేమకు రుణపడి ఉంటాను. ఆయనతో కలసి నటించాలనుంది" అని చెప్పారు. మంచు విష్ణు మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇక నేను చెప్పాల్సిన పని లేదు. మీరు ఆల్రెడీ ట్రైలర్ చూశారు. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని అన్నారు.

అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి

● సినీ ప్రముఖులకు దిల్‌రాజు సూచన



'ప్రభుత్వం నుంచి అవార్డ్ వస్తున్నాయంటే చాలా జాగ్రత్తగా పురస్కారాలను స్వీకరించాలి. ఇది ఇండస్ట్రీలోని అందరికీ చెబుతున్నాను. భవిష్యత్‌లో ప్రభుత్వ పురస్కారాల ప్రకటన వచ్చినప్పుడు ఆ తేదీని డైరీలో నోట్ చేసుకొని... అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి. నా విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను' అని నిర్మాత, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు అన్నారు. శనివారం నిర్వహించిన తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక విజయవంతమైన సందర్భంగా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ 'షూటింగ్స్ ఉన్నా పక్కనపెట్టి పురస్కార గ్రహీతలు స్వయంగా అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలి. అది మన బాధ్యత. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సినీ పురస్కారాలను ఇవ్వబోతోంది. అందరికీ చెబుతున్నా... గుర్తు పెట్టుకోండి. ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా ముందుకెళ్లాల్సిన బాధ్యత ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరిపైన ఉంది' అని చెప్పారు. 'గద్దర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించి విజయవంతం చేశాం. ఆరునెలల నుంచి పడిన కష్టం ఫలించినందుకు చాలా ఆనందంగా ఉంది. సినీ పరిశ్రమలోని వారంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు బావుందంటూ చాలామంది ప్రశంసిస్తున్నారు. సీఎం గారు గంట సమయం ఇస్తానన్నారు. కానీ నా కోరిక మేరకు ఆయన రెండు గంటలకుపైగా ఉండడం ఉత్సాహాన్నిచ్చింది. ఇంత పెద్ద వేడుకలో ఏవైనా పొరపాట్లు జరిగి ఎవరి మనసైనా నొప్పించి ఉంటే వాళ్లకు టీజీఎఫ్‌డీసీ తరపున క్షమాపణలు చెబుతున్నాను' అని దిల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ పాల్గొన్నారు.




'కుబేర' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

ఎస్.ఎస్.రాజమౌళి

"శేఖర్ కమ్ముల పైకి చూడ్డానికి చాలా సాఫ్ట్‌గా ఉంటారు. ఆయన్ని చూస్తూనే మనకి అలా అనిపిస్తుంది. కానీ ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం ఎంత దూరమైనా వెళ్లే మొండి పట్టుదల కలవారు. ఆయన నమ్మే సిద్ధాంతాలనే సినిమాలుగా తీస్తారు. ఆయనలోని ఈ గుణాన్ని నేను ఎంతో గౌరవిస్తాను. ఆయన ముందు ముందు కూడా ఇలానే మనకు మరిన్ని మంచి సినిమాలు అందించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమౌళి మాట్లాడుతూ "ట్రాన్స్ ఆఫ్ కుబేర' టీజర్ చూసి ఆశ్చర్యపోయాను. మేకింగ్ అద్భుతంగా ఉంది. తొలి రోజే సినిమాను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. నాగార్జున మాట్లాడుతూ "ధనుష్ మీ సినిమాలు చేశాను. సెట్స్‌లో మీరు పాత్రలోకి ఎలా పరకాయ ప్రవేశం చేస్తారో చూశాను. మీతో కలసి పనిచేయడం గొప్ప జ్ఞాపకం. ఇది కంప్లీట్‌గా శేఖర్ కమ్ముల సినిమా. ఈ చిత్రానికి ఆయనే హీరో" అని చెప్పారు. ధనుష్ మాట్లాడుతూ "ఇది 'సార్' తర్వాత నా రెండో తెలుగు చిత్రం. నిజానికి 'సార్' కంటే ముందే శేఖర్ కమ్ముల ఈ కథ చెప్పారు. మీ ముందుకు రావడానికి ఇంత టైమ్ పట్టింది. ఆయనో అద్భుత వ్యక్తి. చిన్నప్పటి నుంచి నాగార్జున సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో కలసి నటించడం మరిచిపోలేని అనుభవం. ఇది రెండు భిన్న ప్రపంచాల మధ్య జరిగే కథ" అని పేర్కొన్నారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "రాజమౌళి ఈ కార్యక్రమానికి రావడంతో 'కుబేర' చాలా పెద్ద సినిమా అయ్యింది. దర్శకుడిగా అప్పుడే 25 ఏళ్లు అయ్యాయా అనిపిస్తోంది. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. నిజాయితీగా తీసిన సినిమా ఇది. చాలా కొత్తగా ఉంటుంది. ట్రూ పాన్ ఇండియా చిత్రమిది. అందరికీ కనెక్ట్ అవుతుంది" అని తెలిపారు. నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇప్పుడేం మాట్లాడను. సినిమా విడుదలయ్యాక సక్సెస్ మీట్‌లో మాట్లాడుతా" అని అన్నారు. నిర్మాత పుస్కూర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ "ఇదో విభిన్న చిత్రం. నాగార్జున,ధనుష్ నటన ఈ సినిమాకే హైలెట్‌గా ఉండబోతోంది" అని అన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ



'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి తెరకెక్కించిన చిత్రం '8 వసంతాలు'. 'మ్యాడ్' ఫేమ్ అనంతిక సునీల్‌కుమార్ కీలక పాత్రలో నటించారు. రవితేజ దుగ్గిరాల, హనురెడ్డి కీలక పాత్రలు పోషించారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ప్రేమంటే ఒక దశ మాత్రమే.. దిశ కాదు', 'మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్యనగరాలు ఉన్నాయి.. ఆడదాని ప్రేమకు ఏమున్నాయి? మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్ప' వంటి సంభాషణలు సినిమాపై మరింత అంచనాలను పెంచాయి. ప్రధాన పాత్రధారుల నటన, అద్భుతమైన విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఇది మహిళా ప్రాధాన్యం ఉన్న కథ అయినా, ఇందులోని పాత్రలన్నీ కీలకమే. ప్రతీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఇదో స్వచ్ఛమైన ప్రేమ కథ. నిజజీవితాన్ని తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని పంచుతుంది" అని తెలిపారు.



భూ అంటే భూతం

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తమ్ముడు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. లయ వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'భూ అంటే భూతం' అంటే సాగే గీతాన్ని ఈ మంగళవారం విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

సినిమాకే హైలెట్‌గా

రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ హీరో ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ సూర్యకుమార్ అనే శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు.



తాజాగా, ఈ సినిమాలో కీలకమైన టాకీ పార్ట్‌ను హైదరాబాద్‌లో షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర మధ్య తెరకెక్కుతోన్న ఈ కీలక సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇందులో రామ్ పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోందని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్- మెర్విన్.

ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం

● పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

దాచేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై వందేళ్లుగా సీపీఐ రాజీలేని పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం సీపీఐ కార్యాలయంలో జరిగిన గురజాల నియోజకవర్గ 9వ మహా సభలో ముప్పాళ్ళ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మిక, కర్షక హక్కుల కోసం.. రైతులు, రైతు కూలీలకు న్యాయం కోసం పోరాడింది భారత కమ్యూనిస్టు పార్టీయేనని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలుకుతోందని ఆరోపించారు. అదాని, అంబాని లాంటి దిగ్గజ కార్పొరేట్లు ప్రపంచ కుబేరులుగా మారుతుండగా పేదలు నిరు పేదలుగా మారుతున్నారని విమర్శించారు. అమెరికా ఏం చెబితే మోదీ ఆ విధం గా ఆచరించే విధానానికి అలవాటు పడ్డారని ఎద్దేవా చేశారు. ఇజ్రాయెలు దాడులు చేయడం, యుద్ధోన్మాదానికి మోదీ ప్రభుత్వం మద్దతు పలకడం ప్రమాదకర సంకేతాలు ఇస్తున్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఏ మారుతీ ప్రసాదు, కాసా రాంబాబు, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరవపట్నం రామకృష్ణ, మాచర్ల కార్యదర్శి ఎం శ్రీనివాసరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఏకే నాగమణి, గురజాల కార్యదర్శి రమణారెడ్డి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

నకరికల్లు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నకరికల్లులో వేగంగా వెళ్తున్న లారీ ఢీకొని ఆదివారం ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. నకరికల్లుకు చెందిన కండ్లకుంట సైదులు(25) నకరికల్లులో జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. లారీ ఆగకుండా వెళ్లిపోయింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించగా.. చికిత్స పొందుతూ సైదులు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చేబ్రోలులో ఆదివారం 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం చేబ్రోలులోని పాతరెడ్డిపాలెం ప్రాంతంలోని నరాలశెట్టిపాలెం ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కే వాసు అనే వ్యక్తికి చెందిన గృహం వద్ద మూటల్లో నిల్వ ఉంచిన 15క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

4,500 మందికి స్థానచలనం

ముగిసిన ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

గుంటూరు(విద్య),జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్వల్ప ఆందోళనలు, ఉద్రిక్తతల నడుమ ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఆదివారం ఉదయంతో ముగిసింది. జిల్లా పరిష త్, ప్రభుత్వ, మండల పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ యాజమా న్యాల ఆధ్వర్యంలో దాదాపు 4,500 మందికి స్థాన చలనం కలిగింది. సోమవారం నుంచి కొత్త పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గత నెల 27 నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత స్కూల్ అసిస్టెంట్స్‌కు, ఎస్జీటీలకు ఉద్యోగోన్నతుల తర్వాత బదిలీల ప్రక్రియ ప్రారంభించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు షాక్

ఉపాధ్యాయుల బదిలీల్లో మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే అనేక మంది ఉపాధ్యాయులకు షాక్ తగిలింది. ఈ బదిలీ ప్రక్రియ మున్సిపల్ పట్టణాల మధ్య పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రమే నిర్వహించారు. దీంతో అనేక మంది కౌన్సెలింగ్ కేంద్రంలోనే కన్నీటి పర్యంతమయ్యారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కొంతమంది మంగళగిరి కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. వాస్తంగా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్‌లో దాదాపు 25 సంవత్సరాల నుంచి బదిలీ ప్రక్రియ సక్రంగా జరగడం లేదు. దీంతో ఒకే చోట ఉపాధ్యా యులు సంత్సరాల తరబడి పనిచేస్తున్నారు. కొంతమంది సొంత ఇళ్లు నిర్మించుకుని, పిల్లల్ని అక్కడే చదివించుకుంటూ ఉన్నారు. ఇటువంటి వారు సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి అయిష్టంగానే సుముఖత వ్యక్తం చేశారు. మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో దాదాపు 200 మంది వరకు అదనపు ఉపాధ్యాయులు ఉన్నట్లు తేలింది. వీరికి క్లస్టర్ పాఠశాలల కింద పనిచేయాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది. అంటే ఒక్కో క్లస్టర్ పరిధిలో ఉన్న 15 పాఠశాలల్లో ఎవరైనా సెలవు పెడితే మిగులు ఉపాధ్యాయులను అక్కడికి పంపేలా ఏర్పాట్లు చేశారు. పదవీ విరమణ వల్ల ఏర్పడే ఖాళీల ప్రకారం వీరిని పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు సజా వుగా జరగడం, ప్రభుత్వం కొన్ని అనుకూల నిర్ణయాలు తీసుకోవడం పట్ల



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వెబ్ కౌన్సెలింగ్‌పై వెల్లువెత్తిన నిరసనలు

ఎస్జీటీల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ప్రకారం నిర్వహించాలని తొలుత ప్రభుత్వం భావించింది. అయితే ఉపాధ్యాయులు దీనివల్ల ఒక్కో ఉపాధ్యాయుడు 3 వేల ఆప్షన్లు ఎంచుకోవాల్సి వస్తుందని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వం వెంటనే మ్యాన్యువల్ కౌన్సింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 10న మధ్యాహ్నం నుంచి ఎస్జీటీలకు మ్యాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ ప్రారంభించాలని నిర్ణయించారు. సాంకేతిక సమస్యల వల్ల మరసటి రోజుకు వాయిదా వేశారు. అనంతరం కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా ప్రారంభమైంది. సాంకేతిక కారణాలతో మళ్లీ అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు ప్రక్రియ ముగించారు. దాదాపు 15 రోజుల పాటు వివిధ దశల్లో బదిలీలు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది.

విద్యాశాఖ కొరడా!

విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలు నిరాకరణ

గుంటూరులో 70 ప్రైవేట్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు

ప్రభుత్వానికి నివేదిక

గుంటూరు విద్య, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యాహక్కు చట్టం కింద కేటాయించిన సీట్లకు ప్రవేశాలు నిరాకరించిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలపై విద్యాశాఖ కొరడా ఝుళిపించింది. ఇటువంటి స్కూళ్లను గుర్తించి వాటి గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలంటూ యాజమాన్యాలకు షోకాజు నోటీసులు జారీ చేసింది. గుంటూరు జిల్లాలో విద్యాహక్కు చట్టం ద్వారా దాదాపు 1,150 సీట్లు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో వచ్చాయి. ఈ నెల 10వ తేదీలోగా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే కొన్ని స్కూళ్లు విద్యాహక్కు చట్టం ప్రవేశాలను నిరాకరిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు అందడంతో.. విద్యాశాఖకు సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రభుత్వ ఆదేశాలు బుట్ట దాఖలు

విద్యాహక్కు చట్టం ప్రకారం ఇటీవల కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఒకటో తరగతిలో చేర్పించాలని ప్రైవేటు స్కూళ్లకు వెళ్లగా నిరాకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను అవమానకరంగా మాట్లాడారు.దీంతో వారు గుంటూరు ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆయా స్కూళ్ల యాజమాన్యాలకు రెండు రోజుల క్రితం విద్యాశాఖ నోటీసులు జారీ చేసింది. దీంతో కొన్ని యాజమాన్యాలు విద్యార్థులను చేర్చుకునేందుకు ముందుకు రాగా మరి కొంతమంది వివిధ పత్రాలు లేవని ఇతర సాకులు చూపి అర్హతే ప్రవేశాలను నిరాకరిస్తున్నారు. ఇటువంటి స్కూళ్ల వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని విద్యాశాఖ నిర్ణయించింది. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తాము కోర్టు ఆర్డర్ తెచ్చుకున్నామని ప్రవేశాలు కల్పించలేమని స్పష్టం చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం నుంచి కౌంటర్ పిటిషన్ దాఖలు చేసినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ద్వారా ఎవరికైతే ప్రభుత్వం సీట్లు కేటాయించిందో వారిని తప్పనిసరిగా స్కూళ్లలో చేర్చుకోవాల్సిందేనని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలకు విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

విజయవాడ వెస్ట్ బైపాస్ ఇంకెప్పుడు?



కృష్ణాయపాలెం వద్ద కొండవీటి వాగుపై నిర్మిస్తున్న వంతెన

(5వ పేజీ తరువాయి)

పెరుగుతుంది. దీంతో పాటు దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న విజయవాడ నగరం కొంత మేర విముక్తి పొందుతుంది. ఇప్పటికీ విజయవాడ వారధి, బెంజ్ సర్కిల్, రమేశ్ హాస్పిటల్ సెంటర్, రామవరప్పాడు రింగ్, నిడమానూరు వద్ద ప్రతి రోజూ గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతోంది. విజయవాడ వెస్ట్ బైపాస్ అందుబాటులోకి వస్తే భారీ వాహనాలు అటువైపు వెళ్లిపోతాయి.

పలుచోట్ల పనులు పెండింగ్

వెస్ట్ బైపాస్ ప్యాకేజీ 4లో అత్యంత కీలకమైన కృష్ణానదిపై వంతెన నిర్మాణం ఎప్పుడో పూర్తైపోయింది. ఈ ఏడాది మే 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా వెలగపూడిలో జరిగిన రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమం సందర్భంగా వంతెనపై రాకపోకలకు అనుమతించారు. కృష్ణానదికి ఉత్తరాన ఉన్న జిల్లాల నుంచి వచ్చే వీఐపీలందరికీ ఆ వంతెనపై నుంచే రూట్ మ్యాప్ ఇచ్చారు. అత్యంత కీలకమైన వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంకా అనేక చోట్ల పనులు పెండింగులో ఉన్నాయి. మంగళగిరి మండలం చినకాకాని వద్ద ఎన్‌హెచ్‌తో అనుసంధాన ప్రక్రియ ఇప్పటికీ కొలిక్కి రాలేదు. అమృత యూనివర్సిటీ సమీపంలో ఎన్-6, ఈ-11 రోడ్డు జంక్షన్లో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం కూడా ఇంకా పూర్తికాలేదు. మందడం వద్ద ఈ-8 రోడ్డుపై నిర్మించిన ఫ్లైఓవర్ పనులు, టోల్ గేట్ పనులు ఇంకా చాలా వరకూ పెండింగులోనే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో గొల్లపూడి, నున్న వద్ద పనులు జరుగుతున్నాయి. అక్కడ రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం ప్రాథమిక దశలో ఉంది. దీంతో వెస్ట్ బైపాస్ అందుబాటులోకి రావడానికి మరింత సమయం పట్టే పరిస్థితి కనిపిస్తోంది.

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు

(5వ పేజీ తరువాయి)

రూ. 5 కోట్ల మధ్యన ఉంటే రూ.లక్ష, రూ.5 కోట్ల కంటే అదనంగా ఉంటే రూ. 2.50 లక్షల బ్యాంకు గ్యారెంటీని ముందుగానే సమర్పించాలి. ఇతర ఉత్పత్తులకు అయితే వరుసగా రూ. లక్ష, రూ.2 లక్షల, రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.50 వేలు చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు అన్ని నోటిఫైడ్ వ్యవసాయ ఉత్పత్తులను ఒక గొడుగు కిందకు చేర్చి టర్నోవర్ రూ. కోటి లోపు ఉంటే రూ.2 లక్షలు, రూ. కోటి నుంచి రూ.5 కోట్ల మధ్యన ఉంటే రూ.4 లక్షలు, రూ.5 కోట్ల టర్నోవర్ దాటితే రూ.7 లక్షలు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలకు ఎంత టర్నోవర్ ఉన్నా రూ.లక్షగా బ్యాంకు గ్యారెంటీని నిర్ణయించారు. ఈ సవరణలు కేవలం కొత్తగా జారీ చేయబోయే కమీషన్ ఏజంట్ లైసెన్సులకు మాత్రమే వర్తింపు చేస్తారు.

మిర్చి యార్డులో కొత్త లైసెన్సుల జారీకి సన్నాహాలు

మిర్చి యార్డులో అతి త్వరలోనే కొత్త కమీషన్ ఏజెంట్ లైసెన్సులు మంజూరు చేయాలని మార్కెటింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలు కొంత మంది పేర్లను మార్కెటింగ్ అధికారులకు నివేదించి వాళ్లకు లైసెన్సులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై మార్కెటింగ్ మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అనుమతి రావాల్సి ఉంది. కాగా మిర్చి యార్డులో లైసెన్సు ఉంటే దానిని లీజుకు తీసుకొని ఏటా రూ.3 లక్షలకు పైగా నగదుని బడా వ్యాపారులు చెల్లిస్తుంటారు. దీంతో కొత్త లైసెన్సు పొందేందుకు రూ. 20 లక్షల వరకు చెల్లించడానికి కూడా వెనుకాడరు.

చినుకు రాలదాయె!

(5వ పేజీ తరువాయి)

శాఖ వెల్లడించింది. 54.5 శాతం లోటు నమోదైంది. రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, బొల్లాపల్లి, నూజెండ్ల, శావల్యాపురం, ముప్పాళ్ల, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం నమోదైంది. దుర్గి, కారంపూడి, అచ్చంపేట, అమరావతి, ఈపూరు, రొంపిచర్ల, నరసరావుపేట, చిలకలూరిపేట మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది.

బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలో 35.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 30.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 14.5 శాతం లోటు ఉంది. 25 మండలాలకు గాను 7 మండలాల్లో అత్యధిక లోటు, 6 మండలాల్లో లోటు, ఆరు మండలాల్లో సాధారణ, ఐదు మండల్లాలో అధిక, ఒక మండటంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. చుండూరు, సంతమాగులూరు, మార్టూరు, యద్దనపూడి, అద్దంకి, కొరిశపాడు, చినగంజాం మండలాల్లో అత్యధిక లోటు, అమృతలూరు, బట్టిప్రోలు, చెరుకుంపల్లె, బల్లికురవ, పర్చూరు, చీరాల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

గుంటూరు జిల్లాలో..

గుంటూరు జిల్లాలో 22.7 శాతం లోటు వర్షపాతం ఉంది. ఇప్పటి వరకు 48.4 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 37.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాల్లోని 6 మండలాల్లో అత్యధిక లోటు, మరో ఆరు మండలాల్లో లోటు, మూడు మండలాల్లో సాధారణ, ఒక మండలంలో అధిక, రెండు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మంగళగిరి, తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు ఈస్ట్ మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం ఉంది. తుళ్లూరు, తాడేపల్లి, గుంటూరు వెస్ట్, తెనాలి, చేబ్రోలు, వట్టిచెరుకూరు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

ఉన్నట్టా.. లేనట్టా!?

(5వ పేజీ తరువాయి)

సదరు అధికారులు పనిచేసే చోట నుంచి ఉన్న ఫలంగా రిలీవ్ అయ్యేందుకు సిద్ధపడ్డారు. అంతలోనే ఎవరినీ రిలీవ్ చేయవద్దని డీఏఏలకు కమిషనర్ కార్యాలయం నుంచి సందేశం వచ్చింది. 10వ తేదీ నుంచి సవరించిన జాబితా వస్తుంది రిలీవ్ కావచ్చు అని బదిలీ అయిన అధికారులు ఎదురు చూస్తూనే ఉన్నారు. రోజులు గడుస్తున్నా సవరించిన జాబితా విడుదల కాకపోవడం అధికారుల్లో అసహనానికి కారణం అవుతుంది.

మార్పులు జరుగుతాయని..

ఈ నెల 9న విడుదలైన మండల వ్యవసాయ అధికారుల బదిలీ ఉత్తర్వుల ను తర్వాత సవరించారు. డీడీఏ, ఏడీఏల జాబితానూ సవరిస్తారేమోననే అను మానం చాలామందిలో ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆరంభమైంది. బదిలీ సంగతి ఏమయ్యిందో తేలకుండా పిల్లల విషయంలో నిర్ణయం తీసుకోవడం కష్టతరమని కొందరు అధికారులు ఆవేదన చెందుతున్నారు.

బీసీ సంక్షేమానికి శంకరరావు కృషి : కేంద్ర మంత్రి పెమ్మసాని



బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును సన్మానిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రులు మనోహర్, సత్యకుమార్, పార్థసారథి, బీసీ నేతలు

తెనాలి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా బీసీల సంక్షేమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఎంతగానో కృషి చేస్తున్నారని, బీసీల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం కేసన శంకరరావు దంపతులను బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ అతిపెద్ద బీసీ నాయకుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. గత ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా కూటమి గెలుపు కోసం కేసన పని చేశారని గుర్తుచేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ స్వార్థం లేకుండా బీసీల అభివృద్ధికి శంకరరావు పని చేశారన్నారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బీసీల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే కృషి చేస్తే రాష్ట్రంలో శంకరరావు పని చేశారని అభినందించారు. గృహనిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి రాజీపడకుండా శంకరరావు పోరాడుతారన్నారు. సన్మాన గ్రహీత శంకరరావు మాట్లాడుతూ పేదల ప్రజల కోసమే తన జీవితం అంకితం చేశానని, పదవులకు ఆశపడకుండా పని చేస్తున్నానన్నారు. జొన్నాదుల నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో శంకరరావు జీవిత విశేషాలతో రూపొందించిన 'జయహో బీసీ బంధు కేసన శంకరరావు' సంచికను ఆవిష్కరించారు. కన్నా మాస్టారు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాస్ గౌడ్, హకీంజాని, ఓంకార్ ప్రసాద్, గంటయ్య, గౌరీశంకర్, గాదె వెంకటేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డయేరియా రహిత సమాజాన్ని సాధిద్దాం

● ప్రచార గోడప్రతిని ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్



వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి తదితరులు

తెనాలి, మారీసుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డయేరియా రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తున్నామన్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తెనాలిలో ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలసి మంత్రి డయేరియా నివారణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో ప్రమాదకరమైన వ్యాధి డయేరియాపై విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ నెల 16 నుంచి జూలై 31 వరకు ఇంప్లిమెంటేషన్ ఫేజ్ 2లో భాగంగా డయేరియా నివారణ కార్యక్రమాలను నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించామని మంత్రి చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల సంస్థల చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి, వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, యూపీఎచ్‌సీ వైద్యాధికారిణి వేముల ప్రియాంక, ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్రమౌళి, 104 జిల్లా మేనేజర్ రాఘవకుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

గుంటూరు(విద్య),జూన్ 15(ఆంధ్ర జ్యోతి): అత్యుత్తమ విద్యను అందించి, అభివృద్ధికి సోపానంగా నిలిచిన పాఠశాలల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పడాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. ఆదివారం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వర దేవస్థాన కల్యాణ మండపంలో జరిగిన పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థులైన ప్రజా ప్రతినిధుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పూర్వ విద్యార్థి మోదుగుల వాసుదేవరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగానే కాకుండా, పూర్వ విద్యార్థిగా తనకు విద్యను నేర్పిన సీతారామయ్య హైస్కూల్ అభివృద్ధికి తుది శ్వాస వరకు కృషి చేస్తానన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సీతారామయ్య హైస్కూల్ విద్యా రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నాని మాట్లాడుతూ.. తన ఉన్నతికి, సమాజంలో గౌరవప్రదమైన స్థానానికి సీతారామయ్య హైస్కూలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల వెంకటేష్ యాదవ్, ఎ.సి.పి గుంటుపల్లి శ్రీనివాస్, ప్రొఫెసర్ ద్వారక సుశీల తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, వసంత కృష్ణప్రసాద్, మేయర్ రవీంద్రను పూర్వవిద్యార్థి సంఘ నాయకులు గోగినేని విజయ్‌కుమార్, మోదుగుల వాసుదేవ రెడ్డి, జవహర్ ఆధ్వర్యంలో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మున్సిపల్ ఈఈ నాగమల్లేశ్వరరావు, ఆర్‌వీఆర్ మాజీ ప్రిన్సిపల్ కోట శ్రీనివాస్, డాక్టర్ యశోద, శాంతిశ్రీ, అనంత శేఖర్, గట్టినేని వెంకటేశ్వరరావు, మండలి శ్రీనివాస్, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పెద్ది శ్రీనివాస్, దివాకర్, కొమ్మినేని కోటేశ్వర రావు, బంగారు బాబు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం : డీఈవో

నరసరావుపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓపెన్ స్కూల్)ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఆదివారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి అపరాధ రుసుం లేకుండా జూలై 30వ లోపు, రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. వివరాలకు దగ్గర్లోని సచివాలయం, మండల విద్యా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి చేపల వేట ప్రారంభం

రేపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతమైన నిజాంపట్నం హార్బర్, లంకేవానిదిబ్బ, కొత్తపాలెం, నక్షత్రనగర్‌లో చేపల వేట విరామ సమయం ముగిసింది. సోమవారం నుంచి సముద్రంలో వేట కొనసాగించేందుకు మత్స్యకారులు బోట్లను సిద్ధం చేసుకున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే హార్బర్‌లో గంగపుత్రులు సముద్రమ్మతల్లికి, బోట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేటకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. చిన్నాపెద్ద బోట్లు సుమారు 700పైనే ఉన్నాయి. 2వేల కుటుంబాలు సముద్రవేట చేసుకుంటూ జీవనాన్ని గడుపుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

వినుకొండ నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా గంగాధర్



గంగాధర్

పెదకూరపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా పెదకూరపాడు మండలంలోని గారపాడు గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్‌ను నియమించినట్టు ఆదివారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా భావితరాల భవిష్యత్‌కు అనుగుణంగా టీడీపీ కోసం పనిచేసేవారిని నియమించటం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండి పార్టీ సంస్థాగత ఎన్నికల నియమావళి ప్రకారం కృషి చేస్తానని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న అరసం రాష్ట్ర కార్యదర్శి శరత్ చంద్ర జ్యోతిశ్రీ

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

పెదకూరపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సీపీఐ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్ జ్యోతిశ్రీ అన్నారు. పెదకూరపాడులో ఆదివారం సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ నాయకుడు వెల్లలచెరువు మల్లేశ్వరరావు తదితరులు మాట్లాడారు. సమావేశానికి సీపీఐ నాయకులు పఠాన్ నాగుల్ మీరా అధ్యక్షత వహించారు.

ఉచిత బస్సు పాస్‌లు

సత్తెనపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం ఆర్టీసీ ఉచిత బస్సుపాసు సౌకర్యాన్ని కల్పిస్తుందని, సత్తెనపల్లి ప్రాంతంలోని విద్యార్థులు ఉపయోగించుకోవాలని డిపో మేనేజర్ విజయకుమార్ తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌లోని కౌంటర్‌లో బసు పాసులు అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో బస్సు పాసులు తీసుకున్నవారు క్రమబద్ధీకరించుకోవాల్సి ఉందన్నారు. అందుకు పాత పాసులను కౌంటర్‌లో ఇస్తే కొత్తవి ఇస్తారన్నారు. 12 సంవత్సరాల లోపు బాలురకు, 18 సంవత్సరాల లోపు ఉండి 10వ తరగతి చదివే బాలికలకు ఉచితంగా పాసులు అందిస్తామన్నారు. 20 కిలోమీటర్లు పరిధిలో ఉన్న పాఠశాలలకు పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఆగస్టు నెల చివరి వరకు ఉచిత బస్సు పాసు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుర్తింపు కార్డు కోసం రూ 50 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

షరీఫ్ కుటుంబసభ్యులకు శివరామ్ పరామర్శ

నకరికల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లి గ్రామానికి చెందిన కొలుముల రంజాన్ షరీఫ్ కుటుంబసభ్యులను టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల రంజాన్ షరీఫ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. పల్నాడు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు కొలుముల సైదాకు తమ్ముడైన రంజాన్ షరీఫ్ మృతిపట్ల శివరామ్ సంతాపాన్ని తెలిపారు. రంజాన్ షరీఫ్ కుటుంబసభ్యులకు అండగా ఉంటామని సైదాకు శివరామ్ తెలిపారు.

18న రెంటపాళ్లకు వైఎస్ జగన్ రాక

సత్తెనపల్లి రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 18వ తేదీ బుధవారం రెంటపాళ్ల వస్తారని ఆ పార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ శివ నాగ మల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జగన్ రాక ఏర్పాట్లపై మాజీ మంత్రులు విడదల రజిని, పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, ఎంఎల్‌సీలు తలశిల రఘురామ్, ఎల్ అప్పిరెడ్డి గ్రామాన్ని సందర్శించారు.

సన్మానం

సత్తెనపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ట్రెజరీ నుంచి పెదకూరపాడు ట్రెజరీకి బదిలీ అయిన సబ్ ట్రెజరీ అధికారి బీఆర్‌కే కుమార్‌ను ఆదివారం రిటైర్డు పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేబీఆర్‌జే ప్రసాదు, గద్దె మురహరిరావు, డీ శృంగారం, ఏ ప్రభుదాసు, వెంకటేశ్వరరావు, అంబేద్కర్, నారాయణ, ఇబ్రహీం, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో శశికిరణ్‌కు ర్యాంకు



శశికిరణ్

సత్తెనపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కొదమల ఏడుకొండలు కుమారుడు కొదమల శశికిరణ్ నీట్‌లో జాతీయస్థాయిలో 4,116 ర్యాంకు సాధించాడు. ఎస్సీ క్యాటగిరిలో 98వ ర్యాంకు సాధించాడు. శశికిరణ్‌కు 576/720 మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో శశికిరణ్‌ను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

సత్తెనపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కరాజు గార్లపాడుకు చెందిన పాలేటి లావణ్య, రేపూడి సామేలుకు మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం వారి చదువుల నిమిత్తం స్థానిక ఎక్సైజ్ సీఐ పీ విజయకుమార్ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. పాలేటి లావణ్యకు రూ.30వేలు, రేపూడి సామేలుకు రూ.25వేలు అందించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 513.40 అడుగులు ఉంది. ఇది 137.51 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల...

అచ్చంపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 20.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

పల్నాడులో ఫ్యాక్షన్ సహించం

● హత్యా రాజకీయాలకు సీఎం చంద్రబాబు వ్యతిరేకి

● గుండ్లపాడు పర్యటనలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



జెవిశెట్టి సోదరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పల్నాడులో ఫ్యాక్షన్‌ను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో ఆదివారం ఆయన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి పర్యటించారు. ఇటీవల హత్యకు గురైన టీడీపీ సీనియర్ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు గృహాలకు వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంలో పల్నాడు ప్రాంతంలో ఎక్కడా అక్రమంగా కేసులు, అరెస్టులు, దాడులు లేవని, ప్రశాంతంగా పాలన సాగిస్తున్న ప్రాంతంలో వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారన్నారు. జెవిశెట్టి సోదరులను హత్యచేసిన ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తే లేదన్నారు. పల్నాడులో శాంతిని నెలకొల్పేందుకు సీఎం చంద్రబాబునాయుడు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారన్నారు. త్వరలో ముఖ్యమంత్రితో జెవిశెట్టి కుటుంబసభ్యులకు భేటి ఏర్పాటుచేసి వారిని ఆదుకుంటామన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి తెనాలిలో గంజాయి బ్యాచ్‌ను పరామర్శించడం హేయమని, నిందితులను ప్రోత్సహించినట్లుగా ఉందని ఆరోపించారు.

పల్లెల్లో చిచ్చు పెడితే ఖబడ్దార్: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల నియోజకవర్గంలోని పచ్చని పల్లెల్లో ఎవరైనా చిచ్చుపెట్టాలని చూస్తే ఖబడ్దార్ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. జెవిశెట్టి సోదరుల హత్యకు పాల్పడ్డ పాత్రదారులు, సూత్రదారులకు చట్ట ప్రకారం శిక్షలు పడేవరకు పోరాడతామన్నారు. మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అరాచక శక్తులు వెన్నుతట్టే జగన్‌రెడ్డి వారికి ఏదో అన్యాయం జరుగుతోందని ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తుంటే జగన్‌రెడ్డి ప్రాంతాలు, మతాలు, కులాల మధ్య చిచ్చురేపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ధారునాయక్, కుర్రి శివారెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, కళ్లం రామాంజిరెడ్డి, పంగులూరి అంజయ్య, పుల్లయ్య, కొమెర దుర్గారావు, గుండు కృష్ణమూర్తి, వజ్రం నాయక్, తోట వీరాంజి, శాంతినాయుడు, లింగా బ్రహ్మయ్య, రమేష్, మాగులూరి నారయ్య, మేకల దాసు, కజ్జం సైదయ్య, మందలపు రామకృష్ణ, నేరేటి వీరాస్వామి, రాజబోయిన మధు, గుండాల శ్రీను, జల్లెల కొండలు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంతో ఆనందం

● పలుచోట్ల నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం



పిడుగురాళ్ల: చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, యరపతినేని చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మహిళలు, కూటమి నేతలు



రెంటచింతల: చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, పాలువాయి సర్పంచ్ విజయలక్ష్మి

పిడుగురాళ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వంలో పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం నగదును ఖాతాల్లో జమచేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని నేతలు తెలిపారు. ఆదివారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని చిత్రపటాలకు మహిళలు, కూటమి నేతలు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలలో ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పట్టణ అధ్యక్షులు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, పణితి రవి, కామిశెట్టి రమేష్, కోట హరి, వల్లెపు రామకృష్ణ, దేవళ్ల రాంబాబు, కుంచపు గంగరాజు, చల్ల గుండ్ల సీత, మద్దినేని సైదమ్మ, హనుమాయమ్మ, కొంకా రాధ, బిజిలి అంజలి, జొన్నలగడ్డ లక్ష్మి, అనురాధ, కె.లక్ష్మి, చల్లా అంజమ్మ, తాళ్ల నిర్మల, అరుంధతి పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం

మాచవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేరుస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ హసాన్‌వలి అన్నారు. ఆదివారం తురకపాలెంలో తల్లికి వందనం లబ్ధిదారుల కుటుంబాలకు వెళ్ళి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తురకపాలెంలో సుమారు 15 కుటుంబాల వారికి ముగ్గురు పిల్లల చొప్పున నగదు జమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్ మాబూవలి ఉన్నారు.

● రాజుపాలెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన కాలంలో తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి పిల్లవాడి చదువుకు ఉపయోగపడేలా తల్లుల ఖాతాలో నగదు జమ చేశారని తెలుగుయువత అధికారప్రతినిధి షేక్ అల్లాభక్షు తెలిపారు. రాజుపాలెంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అద్భుతంగా పరిపాలన సాగిస్తుందని, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రతి ప్రభుత్వ పాఠశాలకు పాఠ్యపుస్తకాలు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తోందన్నారు. సమావేశంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లమోతుల శ్రీనివాసరావు, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. పాలువాయి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కామనబోయిన గోపి, వెంకటరమణ దంపతులకు ఐదుగురు సంతానం.. వారిలో నలుగురు ఆడపిల్లలు. వారిలో త్రివేణి, రమ్య, మానసలక్ష్మి, జగనదీపిక, గోపికృష్ణ వారంతా వరుసగా 10,8,6,3,2 తరగతులు చదువుతున్నారు. అలాగే బోయిన కాటంరాజు, సంధ్యారాణి దంపతులకు నలుగురు ఆడపిల్లలు. వారందరూ స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. వీరందరికి తల్లుల ఖాతాల్లో నగదు జమకావడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మందలపు విజయలక్ష్మి, హనిమిరెడ్డి, కోటిరెడ్డి, వట్టి రామిరెడ్డి, కె.సాంబయ్య, పి.శ్రీనివాసరావు, వై.లింగయ్య పాల్గొన్నారు.

నేడు రైల్వేలైన్‌కు పెగ్‌మార్క్ ఏర్పాటు

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి నూతనంగా నిర్మించే రైల్వేమార్గానికి సంబంధించి మండల పరిధిలోని కర్లపూడి, ఎండ్రాయి, వైకుంఠపురం గ్రామాలలో పెగ్‌మార్క్ ఏర్పాటును సోమవారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ డానియేలు తెలిపారు. రైల్వే అధికారులు, రెవెన్యూ సర్వేయర్ బృందం కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

పోలీసులమని ట్రాక్టర్ డ్రైవర్‌కు బెదిరింపు

పెదకూరపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పోలీసులమని చెప్పి ట్రాక్టర్ డ్రైవర్‌కు ఇరువురు వ్యక్తులు బెదిరించిన సంఘటన పెదకూరపాడులో జరిగినట్టు ఎస్ఐ గిరిబాబు ఆదివారం తెలిపారు. 14వ తేదీ రాత్రి వెలగల నాగరాజు ఇసుక ట్రాక్టర్‌తో రైల్వేగేటు దగ్గరకు వచ్చేసరికి సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన గ్రామానికి చెందిన కంచర్ల పున్నయ్య, తుళ్ళూరు గ్రామానికి చెందిన చెరుకూరి వరప్రసాదులు ట్రాక్టర్ డ్రైవర్ నాగరాజును లైసెన్స్, ఆర్‌సీని చూపించమనటంతో పాటు లేకపోతే రూ.3వేలు డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. నాగరాజు గట్టిగా కేకలువేయటంతో వారు పరారయ్యారు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

దేవస్థాన దుకాణాల వేలం నిర్వహించాలి

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి) అమరావతిలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 33 దుకాణాల సముదాయానికి దేవదాయశాఖ అధికారులు నిర్ణయించినట్లు తప్పనిసరిగా అద్దె వేలం నిర్వహించాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వేలానికి సంబంధించి ప్రజాప్రతినిదులు జోక్యం చేసుకోకుండా దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వేలంలో అన్యమతస్తులకు అవకాశం కల్పించకూడదని అధికారులను కోరారు. అంతేగాకుండా శిధిలావస్థకు చేరిన ఆలయాన్ని అభివృద్ధి చేసి దూప దీప నైవేద్యాలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ సభ్యులు మద్ది ఆనంద్, ఎం విశ్వనాథం, ఏ రమేష్, ఆర్ నాగరాజు, కే సాంబశివరావు, కే వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మద్ది ధాత్రినారాయణ, జిల్లా కిసాన్ మోర్చ జనరల్ సెక్రటరీ జీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుంపాలెంలో సోలార్ లైట్ల ఏర్పాటు

అచ్చంపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి సంఘం సహకారంతో సోలార్ లైట్లు ఏర్పాటుచేసినట్టు సంఘ అధ్యక్షుడు తుమ్మా శౌరిరెడ్డి ఆదివారం తెలిపారు. ఒక్కో లైటు ఖరీదు రూ.8వేలు ఉండగా 15 లైట్లకు అయిన వ్యయాన్ని సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావుకు అందజేశారు. మండలంలోనే మొదటి సోలార్ లైట్లు ఏర్పాటైన గ్రామంగా గుర్తింపు పొందినట్టు శౌరిరెడ్డి తెలిపారు. సంఘ సభ్యులు మన్నెం భద్రయ్య, చింతగుంట్ల సత్యనారాయణరెడ్డి, కందుల దశరథరామయ్య, తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత సీఎం చంద్రబాబు

● టీడీపీ సీనియర్ నేత యాగంటి



విలేకరులతో మాట్లాడుతున్న యాగంటి

మాచర్లటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దివాళా దశలో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడుదేనని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రాన్ని గాడిన పెట్టి అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి రాష్ట్రంలోని పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గత పాలనలో ప్రజలు విసిగిపోయి వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసినా వారికి ఏమాత్రం బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అరాచక శక్తులను రెచ్చగొట్టి గొడవలు సృష్టించడం ద్వారా ప్రశాంతత లేకుండా చేయాలని వారు చూస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళలకు ఆగష్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం అమలులోకి వస్తుందన్నారు. రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనవసర విమర్శలు మానుకోకపోతే వైసీపీకి 11 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. ఏపీ రాజధాని అమరావతిలో వైసీపీ నాయకులు గడ్డి మొక్కను కూడా పీకలేరని యాగంటి అన్నారు. రాజధాని అమరావతిని తీర్చిదిద్దేందుకు చంద్రబాబు చెమటోడ్చారని, జగన్‌రెడ్డి అమరావతిపై విషం కక్కారన్నారు. అమరావతి మహిళలను కించపరిచేలా తప్పుడు మాటలు మాట్లాడుతున్న వారికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. సమావేశంలో తిక్కా కొండలు, దుర్భాకుల ప్రసాద్, గాజుల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ సంతోష్, బాదన్‌బాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మాచర్లటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఆధ్వర్యాన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్యలు మాట్లాడుతూ పట్టణంలోని ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యనభ్యసించి 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు వారు జాబ్‌మేళాకు అర్హులన్నారు. జాబ్‌మేళాకు గోదావరి ఆంధ్ర కార్పోరేటివ్ సొసైటీ బ్యాంకు, మాస్టర్ మైండ్స్, హ్యాపీ మొబైల్స్, పేటీఎం, జస్ట్ డయల్ వంటి 10 రకాల కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 7842747682, 7702921219, 91005 66581 లను సంప్రదించాలన్నారు.

రెంటాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

రెంటచింతల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామంలో రూ.5కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్లో మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ ఫేజ్ 2 కింద అంచనాలను రూపొందించి ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ ఆమోదానికి పంపామన్నారు. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటైతే లోవోల్టేజ్ సమస్యను నివారించవచ్చన్నారు. ఇప్పటికే పాలువాయి గ్రామంలో రూ.50లక్షలతో చేపట్టిన ఆర్‌డీఎస్ఎస్ పనులు, 25 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు చివరి దశకు చేరాయన్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి విస్తృతంగా ప్రచారం కల్పించడానికి అధికారుల బృందం కృషి చేయాలని కోరారు.

ఆరు నెలలుగా షాపింగ్ కాంప్లెక్స్ మూత

ముప్పాళ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని షాపింగ్ కాంప్లెక్స్ ఆరు నెలలుగా మూతపడింది. మండల పరిషత్ కార్యాలయ పరిధిలో 5 షాపులను గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు నిర్మించారు. అప్పటి నుండి మండల పరిషత్ కార్యాలయానికి నెలకు సుమారు రూ.10వేల వరకూ ఆదాయం సమకూరుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన వేలం గడువు 2024 డిసెంబరుతో ముగిసింది. దీంతో ఆరునెలలుగా షాపులకు వేలం నిర్వహించకపోవడంతో మూతవేసి ఉన్నాయి. దీంతో మండల పరిషత్ కార్యాలయం ఆదాయం కోల్పోతోంది. అధికారులు స్పందించి షాపులకు వేలం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రత్నంను వివరణ కోరగా రికార్డులను పరిశీలించి వేలం నిర్వహించే ఏర్పాట్లు చేస్తామన్నారు.



మూతపడిన షాపింగ్ కాంప్లెక్స్

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి..

రెంటచింతల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పొందాలనుకునే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో కట్టా లక్ష్మారెడ్డి కోరారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది రైతులకు ఈకేవైసీ చేస్తున్నారని చెప్పారు. ఆధార్ లింక్‌ను బ్యాంక్‌కు వెళ్లైనా చేసుకోవచ్చన్నారు. మండలంలో 10,600 మంది అన్నదాతలను అర్హులుగా గుర్తించామని వీరికి ఈకేవైసీ చేయిస్తున్నామన్నారు. ఈనెల 20వ తేదీ లోగా ఈకేవైసీ చేయించుకున్నవారికే లబ్ధి చేకూరుతుందన్నారు.



గురజాల: సదస్సులో మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని

వృద్ధులను వేధిస్తే చర్యలు తప్పవు

● అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్

దుర్గి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వృద్ధులను వేధిస్తే చర్యలు తప్పవని మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ అన్నారు. ఆదివారం దుర్గిలోని జేఎంజే వృద్ధాశ్రమంలో వృద్ధులపై వేధింపులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను సంరక్షించుకోవడం బాధ్యతగా గుర్తించాలన్నారు. వృద్ధుల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, ఇతరత్రా వేధించినా చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం వృద్ధులకు పం డ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గురజాలలో..

వయోవృద్ధుల వేధింపులపై గురజాల మండలంలోని గంగవరంలో గల అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో నిర్లక్ష్యం వహించడం, వైద్య, శారీరక సంరక్షణ అవసరాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించడం, వారిని వేధింపులకు గురిచేయడం చట్ట ప్రకారం నేరమన్నారు. వృద్ధులు మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కత్తి చలమరాజు, న్యాయవాదులు షేక్ జానీబాషా, రఫీ, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి

● ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

కారంపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో ఉన్నం హాస్పిటల్, ఆర్కా హాస్పిటల్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మెగా హెల్త్ క్యాంపును ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ఇలాంటి మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసి పేద ప్రజలకు అండగా నిలుస్తామన్నారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ఉన్నం హాస్పిటల్ అధినేత ఉన్నం నాగమల్లికార్జునరావు మాట్లాడుతూ మున్ముందు మరిన్ని హెల్త్ క్యాంపులు ఏర్పాటుచేస్తామన్నారు. శిబిరంలో 1236 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరి అంజయ్య, పుల్లయ్య, గోళ్ల సురేష్ యాదవ్, ఉన్నం లక్ష్మీనారాయణ, బొల్నేడి శ్రీనివాసరావు, చప్పిడి రాము, మునుగోటి సత్యం, గాడిపర్తి రమాదేవి, బొమ్మిన శేషగిరి, సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, యేచూరి శంకర్, లింగా రమేష్, జానకి రామయ్య, వైద్యులు ఉన్నం దీపిక, రాజునాయుడు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అత్యుత్తమ పథకం

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తల్లికి వందనం పథకం దేశంలోనే అత్యుత్తమ పథకమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు పాఠశాలకు వెళ్తుంటే అంతమందికి నిధులు విడుదల చేయడం చరిత్రలో నిలిచిపోయే పథకమన్నారు. ప్రతి పేద పిల్లవాడు చదువుకొని ఉన్నత చదువులతో రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ సంకల్పిస్తున్నారన్నారు. వైసీపీ నేతలకు తల్లికి వందనం పథకం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వైసీపీ హయాంలో ఈ పథకానికి రూ.5వేల కోట్లు ఖర్చుచేయగా కూటమి ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించిందన్నారు. గతంలో జగన్ కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానని జగన్ చెప్పిన మాట వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. విద్యార్థుల పట్ల జగన్ కంసమామగా మారాడని యరపతినేని ఎద్దేవా చేశారు. తల్లుల ముఖంలో ఆనందాన్ని చూసి తట్టుకోలేని వైసీపీ సైకో బ్యాచ్ ఈ పథకంపై తప్పుడు ప్రచారం మానుకోకుంటే తల్లులు, మహిళల చేతుల్లో చావుదెబ్బ తినాల్సివస్తుందని ఎమ్మెల్యే యరపతినేని సూచించారు.

అమరావతిలో 8353 మందికి తల్లికి వందనం

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న తల్లికి వందనం పథకం ద్వారా మండలంలోని 8,353 మంది పాఠశాల విద్యార్థులకు లబ్ధి చేకూరిందని, దీనిద్వారా రూ10.85కోట్లు తల్లుల ఖాతాలలో జమచేసినట్లు ఎంఈవో శివబాబు తెలిపారు. నగదు ఖాతాలలో జమకాని వారు స్థానిక సచివాలయంలో సంప్రదించాలని తెలిపారు. వీటితోపాటు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పేరుతో పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు.

నిరుపేద విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేత

క్రోసూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): క్రోసూరుకు చెందిన నిరుపేద విద్యార్థిని వడ్లమూడి రూపాంజలి(డిగ్రీ ద్వితీయ సంవత్సరం)కి ఆదివారం మాగులూరి ఫౌండేషన్ సభ్యులు ఉచితంగా ల్యాప్‌ట్యాప్ అందజేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాండ్రు కాశయ్య దీనిని విద్యార్థినికి అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, జనసేన నాయకులు కంభంపాటి రాము, టీడీపీ నాయకులు దుద్దుల యోహాన్, బండారు రాము, ఫౌండేషన్ సభ్యులు మాగులూరి కృష్ణారావు, కిరణ్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ అమ్మవారికి పల్లకి సేవ

దుర్గి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీ అమ్మవారి పల్లకిసేవతో గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం మండలంలోని అడిగొప్పులలో నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి సన్నిధికి రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం శ్రీలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు.

సాయిబాబా దేవాలయ వార్షిక పూజలు

పిడుగురాళ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సాయివిహార్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా దేవాలయ పుష్కర వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, దత్తాత్రేయ మహాహోమం నిర్వహించారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ, నిత్యహోమం జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పెన్షనర్స్ హోమ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, జూన్ 15, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్ హోమ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా ఈ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక అదనపు సీనియర్ సివిల్ న్యాయ అధికారి ఏ లావణ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను సంరక్షించుకోవడం వారి బాధ్యత అన్నారు. ఈ బాధ్యతను ఎవరు విస్మరించకూడదన్నారు. వయోవృద్ధుల చట్టం, మనోవర్తి, ఉచిత న్యాయ సహాయం, ఉచిత న్యాయ సలహా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వృద్ధుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు ఇచ్చారు. ఉచిత న్యాయసాయం, న్యాయ సలహా కోసం మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు గన్నే వెంకట సుబ్బారావు, న్యాయవాది అచ్చి ఏడుకొండలు, పారా లీగల్ వలంటీర్లు, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు జి.చంద్రపాల్, పెన్షనర్స్ అధ్యక్షుడు, సభ్యులు, నరసరావుపేట మొదటి పట్టణ ఎస్ఐ అరుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మోహన్‌కు ఘన నివాళి

చిలకలూరిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన కళానిలయం సంస్థ వ్యవస్థాపకుడు, సీనియర్ కళాకారుడు ప్రగడ రాజమోహనరావు (పీఆర్ మోహన్) సంస్మరణ కార్యక్రమం పట్టణంలోని ఆర్‌వీఎస్ హైస్కూల్ ఎదుట ఉన్న హరినాథ్ బాబా మందిరంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక కళా సంస్థలు, ప్రజా నాట్య మండలి, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, సీనియర్ కళాకారులు ఏవీ శివయ్య, గంజి పోలయ్య, జమాల్ భాషా, సలీం, పేలూరి రామారావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, డాక్టర్ పీవీ సుబ్బారావు, డాక్టర్ గట్టు రంగారావు పాల్గొని మాట్లాడుతూ కళానిలయం జాతీయ స్థాయి నృత్య పోటీల ద్వారా పీఆర్‌మోహన్ చిలకలూరిపేట ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటి చెప్పారన్నారు. కళాకారుడిగా పీఆర్ మోహన్‌తో తమకున్న అనుభవాలు, అనుభూతుల గురించి తోటి కళాకారులు వివరించారు. కళా నిలయం ద్వారా ఎందరో కళాకారులను సృష్టించిన ఘనత పీఆర్ మోహన్‌దే అని కొనియాడారు. సభకు ఏవీ శివయ్య అధ్యక్షత వహించారు. ముందుగా పీఆర్ మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

నేడు వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోగులపాడులోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సాయంత్రం అన్నదాన కార్యక్రమం జరగనుంది.

రియల్ ఎస్టేట్ ఏజెంట్లను ప్రభుత్వం ఆదుకోవాలి

వినుకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ ఏజెంట్లను ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఏజెంట్ల అసోసియేషన్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఆదివారం వినుకొండలో రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. వినుకొండలో సుమారు 300 మంది రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఉన్నారని, ప్రస్తుత తరుణంలో ఏజెంట్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు గుర్రం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి షేక్ బాజీద్, ట్రెజరర్ రాఘవయ్య, నరసారెడ్డి, మస్తాన్ వలి, మునెయ్య, గర్రె నరసింహరావు, కృష్ణారెడ్డి పాటు సభ్యులు, ఏజంట్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్

అప్పుల ఊబిలో భారతదేశం

● మారుతీ వరప్రసాద్

వినుకొండ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భారతదేశం అప్పుల ఊబిలోకి కూరుకుపోతోందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశాన్ని 200 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ విమర్శించారు. వినుకొండలో సీపీఐ మహాసభల నేపథ్యంలో శనివారం రాత్రి ఆజాద్ కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అధికారంలో బీజేపీ రాష్ట్రానికి వరగబెట్టింది ఏమీ లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పి, నేటికీ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. రైతులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రం కాలరాసిందని, రాష్ట్రానికి 10సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని హామీఇచ్చిన అమలుచేసిన దాఖలాలు లేవని ఆవేద వ్యక్తంచేశారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీకి సొంత గనులు ఇవ్వడంలో పూర్తి విఫలమైందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సంద్రపాటి సైదా, నియోజకవర్గం కార్యదర్శి బుదాల శ్రీనివాసరావు, రాము, వెంకటేశ్వర్లు, సోడాల సాంబయ్య, వందనం, మస్తాన్‌వలి, జల్లి వెంకటేశ్వర్లు, రమణ, కాశమ్మ, పద్మ, గోవిందమ్మ, మరియమ్మ, వెంకటయ్య, రాములు, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గుండేపల్లి పాఠశాల



శిథిలావస్థలో ఉన్న గుండేపల్లి ప్రాథమిక పాఠశాల భవనం

● అధ్వానంగా ఆవరణ ● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ఈపూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండేపల్లి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల కాలంనాటి భవనం కావడంతో పెంకులు ఊడిపడుతున్నాయి. పెంకులు మీదపడతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అదేభవనంలో అంగన్వాడీ పాఠశాల నిర్వహిస్తున్నారు. పక్కనే మరో భవనంలో తరగతులు చెబుతున్నారు. ఆ భవనం పిల్లర్లు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటపడ్డాయి. గోడలు అధ్వానంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ పాఠశాలలో కనీసం విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలంలేదు. ఉన్న స్థలంలో కొందరు గుడిని నిర్మించారు. వీటికి తోడు ప్రైవేటు సంస్థల వాళ్ళు ఆర్వో ప్లాంటు నిర్మించారు. దీంతో పాఠశాల ముందు పారిశుధ్యం అధ్వానంగా ఉంది. అధికారులు, పాలకులు స్పందించి నూతన పాఠశాల భవనంను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.



ఊచలు బయటపడిన పాఠశాల భవన పిల్లర్లు



కుంగిపోయిన సైకప్పు, ఆవరణలో నిర్మించిన ఆర్వో ప్లాంట్

జగన్ పత్రికను, చానెల్‌ను బ్యాన్ చేయాలి

● తెలుగు మహిళల డిమాండ్

నరసరావుపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంత మహిళలపై విష ప్రచారం చేస్తున్న జగన్ పత్రికను, చానెల్‌ను నిషేధించాలని నియోజకవర్గ తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో టీడీపీ జిల్లా కార్యాలయం నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ప్లకార్డులు పట్టుకొని తెలుగు మహిళలు నిరసన ర్యాలీ చేశారు. సాక్షి ప్రతులను, ప్లకార్డులను దహనం చేసిన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా నేతలు మాట్లాడుతూ సాక్షి చానెల్ డిబేట్‌లో కృష్ణంరాజు అసభ్యంగా మాట్లాడటం, దానికి కొమ్మినేని శ్రీనివాసరావు వంత పలకడం సిగ్గుచేటన్నారు. సాక్షి చానెల్‌ను అడ్డం పెట్టుకొని రాష్ట్రం, అమరావతి మహిళలపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంటే కనీస గౌరవం లేదన్నారు. అమరావతి ప్రాంత మహిళలను జుగుప్సాకరంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనికి జగన్ మోహన్‌రెడ్డి, భారతిరెడ్డి నైతిక బాధ్యత వహించాలని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి పత్రిక, చానల్ బ్యానే చేసేవరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలుగు మహిళలు అన్నారు.

కార్యక్రమంలో శిల్పారామం చైర్మన్ మంజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి, రాష్ట్ర మహిళా నేతలు నూర్జహాన్ బేగం, కనుమూరి లక్ష్మి, గంగినేని లీలావతి, జరీనా బేగం, వేగుంట రాణి, విరియాల రత్నకుమారి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు కోసూరి రాధిక, విజయలక్ష్మి, రాజేశ్వరి, కొబ్బరి లక్ష్మి, మల్లేశ్వరి, పద్మ, సీతామహాలక్ష్మి, వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తెలుగు మహిళా నేతలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ధ్యానం గొప్పతనాన్ని వివరిస్తున్న నరసారెడ్డి మాస్టారు

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి: నరసారెడ్డి

వినుకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని ధ్యాన మాస్టర్ నరసారెడ్డి సూచించారు. స్థానిక కొండ మెట్ల వద్ద ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో పిరమిడ్ మెడిటేషన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరాయకొండ ధ్యాన మాస్టర్ నరసారెడ్డి పాల్గొని ముందుగా రక్షణ ఆశ్రమ నిర్మాణ పనులు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో దేవస్థానం మంచి ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నేటి కంప్యూటర్ కాలంలో సమయం కుదిరినప్పుడల్లా ప్రతి ఒక్కరూ ధ్యానంపై దృష్టి పెట్టాలన్నారు. మనిషి ఎదుర్కొంటున్న ఒడిదుడుకులు లేని ప్రశాంత జీవనానికి ధ్యానం దోహదపడుతుందని అన్నారు. కలుషిత ఆహార కారణంగా మనిషి జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయని, ధ్యానం ద్వారా జీవన ప్రమాణాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మాల్యాద్రి నరసింహారావు, రామారావు, ఉపేంద్ర, నాగలక్ష్మి, పద్మావతితోపాటు కనమర్లపూడి, పెద్దకంచర్ల, శానంపూడి తదితర గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత కావూరు ప్రిన్స్ యూత్ జట్టు

చిలకలూరిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం కావూరు-అప్పాపురం మార్గంలో ఈ నెల 3 నుంచి నిర్వహిస్తున్న కావూరు యూత్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. 8 రోజుల పాటు పోటీలు నిర్వహించారు. కావూరు ప్రిన్స్ యూత్, ఇర్లపాడు జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్స్ పోరులో కావూరు యూత్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలైన కావూరు ప్రిన్స్ యూత్‌కు పట్టణానికి చెందిన జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్) ఆధ్వర్యంలో సభ్యులు జెర్రిపోతుల బుల్లిబాబు రూ.20,116 బహుమతిగా అందచేశారు. ఇర్లపాడు టీమ్ ద్వితీయ బహుమతి సాధించగా విఘ్నేశ్వర పాలకేంద్రం వాసు రూ.15,116 ద్వితీయ బహుమతిగా అందచేశారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

● రక్షించిన పోలీసులు

యడ్లపాడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ మహిళను యడ్లపాడు పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు గ్రామానికి చెందిన గాడిపర్తి సురేష్ ఆదివారం మధ్యాహ్నం సుమారు 2.30గంటల సమయంలో డయల్ 100కి ఫోన్‌చేసి తన సోదరి వైవాహిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోబోతున్నదని రక్షించాలని కోరాడు. సమాచారం అందుకున్న యడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ వెంటనే ఆ మహిళతో మాట్లాడాడు. మాట్లాడుతుండగానే తనకు జీవితంపై విరక్తి చెందానని తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. పరిస్థితి తీవ్రతను గమనించిన ఎస్ఐ ఆమె మొబైల్ సిగ్నల్స్‌ను ట్రాక్‌చేసి సదరు మహిళ ఉన్న ప్రాంతంలోని సెల్ టవర్ లొకేషన్ గుర్తించారు. ప్రకాశ జిల్లా నాగులుప్పలపాడు మండలం తక్కెళ్ళపాడు గ్రామ శివారులో ఉన్న ఆమెను బుజ్జగించి యడ్లపాడుకు స్టేషన్‌కు తీసుకువచ్చారు. సురక్షితంగా బంధువులకు అప్పగించి జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డయల్ 100, శక్తి మొబైల్ యాప్ వంటి అత్యవసర సేవలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ప్రజలను కోరారు. ప్రాణాలను కాపాడడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.



నోటు పుస్తకాలు అందజేస్తున్న చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్, కమిషనర్ శ్రీహరిబాబు

విద్యార్థులకు నోటు పుస్తకాల అందజేత

చిలకలూరిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ కాలనీ పార్కులో ఆదివారం 25మంది విద్యార్థులకు రూ.10వేల విలువైన నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పార్కు కమిటీ కార్యదర్శి ఆరెకట్ల కోటి సుబ్బారావు మేనకోడలు కాపు శ్రీవేణి జ్ఞాపకార్థం పుస్తకాలు అందచేశారు. ఈ కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు గుడిపల్లి సాంబశివరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు, అర్బన్ సీఐ పి.రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీకి చెందిన ఆరెకట్ల కోటి సుబ్బారావు, చిరుమెళ్ళ శ్రీనివాసరావు, సంకటి సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

చివరి భూములకు సాగు నీరు




గతంలో కంప చెట్లతో ఉన్న త్రిపురాపురం మేజర్, మరమ్మతుల అనంతరం కాలువ, ఇరువైపులా ఉన్న కాలువ కట్ట

నూజెండ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కాలువ మరమ్మతులకు శ్రద్ధ చూపక పోవటంతో రైతులు సాగునీరు కోసం కాలువ కట్టలపై ప్రయాణం ప్రమాదకరంగా ఉండేది. దీంతో రైతులు అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి సంఘాలను ఏర్పాటుచేసి వారి ఆధ్వర్యంలో ఎన్ఎస్‌పీ కాలువల మరమ్మతులు జరగటంతో నేడు చివరి భూములకు సాగునీరు అందటంతో పాటు కాలవ కట్టలపై ప్రయాణం రైతులకు సౌకర్యవంతంగా మారింది. త్రిపురాపురం డీసీ చైర్మన్‌గా గంగినేని రాఘవ ఎన్నికైన అనంతరం ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులు ఎదుర్కొన్న సమస్యలను అధికారుల దృష్టికి, ప్రాజెక్టు కమిటీ దృష్టికి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేసి అధిక మొత్తంలో నిధులు కేటాయింపులు చేయించారు. దీంతో త్రిపురాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలోని త్రిపురాపురం, నూజెండ్ల మేజర్లు, ఆరు మైనర్లు, మూడు సబ్ మైనర్లను, ఒక లిఫ్ట్ కాలువకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించటంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. రైతులకు సాగునీరు కష్టాలు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి కష్టాలు లేకుండా చేయటమే లక్ష్యం:

● గంగినేని రాఘవ, త్రిపురాపురం డీసీ చైర్మన్



చివరి భూములకు సాగు నీరు అందించటమే లక్ష్యంగా పని చేస్తున్నామని త్రిపురాపురం డీసీ చైర్మన్ గంగినేని రాఘవ అన్నారు. త్రిపురాపురం మేజరుకు నీటి విడుదల, వారాబంది అమల్లో అధికారులతో చర్చించి కాలువలకు నీరు వచ్చేలా పర్యవేక్షించామన్నారు. రైతులకు సాగు నీరు అందించటంలో ముందుండి పని చేస్తానన్నారు.



నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్తంభాలు, వీ అప్పాపురంలో ఉన్న పోల్స్

నూజెండ్ల విద్యుత్ సబ్ స్టేషన్‌కు 33కేవీ రెండో విద్యుత్ లైన్ నిర్మాణం

నూజెండ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల విద్యుత్ సబ్ స్టేషన్‌కు ప్రకాశం జిల్లా నుంచి విద్యుత్ ప్రతికూల పరిస్థితుల్లో విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు నూజెండ్ల 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఈదర నుంచి రూ.60లక్షల వ్యయంతో ఎనిమిది కిలోమీటర్ల మేర నూజెండ్ల, వీ అప్పాపురం, అప్పాపురం ఎస్సీ కాలనీ, కొమ్మవరం, ఈదర వరకు 33కేవీ విద్యుత్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వినుకొండ నుంచి నూజెండ్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సమయంలో ఈదర సబ్ స్టేషన్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేసేలా, అదే విధంగా ప్రకాశం జిల్లా ఈదర సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగిన సమయంలో నూజెండ్ల నుంచి 33కేవీ విద్యుత్ అందజేసేలా విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు వివరించారు. నిత్యావసరంగా మారిన విద్యుత్‌లో అంతరాయాలను నివారించేందుకు ప్రత్యేకంగా నిర్మిస్తున్న విద్యుత్ లైన్ మండల ప్రజలకు, పరిశ్రమలకు ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

రొంపిచర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని వీరవట్నం గ్రామంలో కాలువ మరమ్మతు పనులను ఆదివారం ప్రారంభించారు. సుమారు రూ.12లక్షల వ్యయంతో నిర్మించనున్న పనులను ప్రారంభించారు. పూడికతీత, పిచ్చి చెట్ల తొలగింపు, కట్టలు బలపరచటం వంటి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలువలు పూడిపోయాయని తెలిపారు. వాటిని పట్టించుకోకుండా భూములకు సక్రమంగా సాగునీరు అందించలేదని పేర్కొన్నారు. దీంతో రైతులు పంటలు పడించుకోవటానికి ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం కాలువల ఆధునికీకరణకు నిధులను విడుదలచేసి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి ఆదుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గాడిపర్తి సురేష్, ఇంటూరి ప్రసాదు, చల్లా సుబ్బారావు, మొండితోక రామారావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయ సేవా సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కె నరేంద్రరెడ్డి

సీనియర్ సిటిజన్‌లకు న్యాయ సేవా సదస్సు

చిలకలూరిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా సంస్థ చైర్మన్, జడ్జి కె.నరేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వృద్ధులపై వేధింపులకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్లు తమ పిల్లలకు ఆస్తి పంపకాలు చేసినప్పటికీ, పిల్లలు వారిని సరిగా చూసుకోకపోతే కోర్టును గాని, ఆర్డీవోను గాని సంప్రదించవచ్చునని సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి తగిన సలహాలు పొందవచ్చునని కూడా తెలిపారు. సదస్సులో సీనియర్ న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, టి.రామాంజనేయులు, ఎం.భానుప్రసాద్, పెన్షనర్ల సంఘానికి చెందిన కె.జాషువా, వెంకటప్ప, షేక్ రహంతుల్లా పాల్గొని మాట్లాడారు.

నీట్‌లో పమిడిపాడు విద్యార్థికి 1649వ ర్యాంకు

బొల్లాపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మెడికల్, డెంటల్ కోర్సుల ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ యూజీ 2025 పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. బొల్లాపల్లి మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన కొత్త భవిష్యారెడ్డి ఆల్ ఇండియాలో 1649వ ర్యాంకు సాధించింది. ఉమెన్ జనరల్ క్యాటగిరిలో 940వ ర్యాంకు సాధించింది. మొత్తం 720 మార్కులకు గాను 596 మార్కులు సాధించింది. భవిష్యరెడ్డి కారంపూడి 10వ తరగతి విద్యభ్యసించింది. ఆమెకు 10వ తరగతిలో 589 మార్కులు వచ్చాయి. విజయవాడలో ఇంటర్‌లో విద్యను పూర్తి చేసింది. ఇంటర్‌లో 979 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఎంసెట్ ఫలితాల్లో రాష్ట్రంలో 103వ ర్యాంకు సాధించగా నిన్న విడుదల చేసిన నీట్ యూజీ 2025 పరీక్షా ఫలితాల్లో ఉమెన్స్ జనరల్ కోటాలో 940వ ర్యాంకు సాధించింది. ఈ ర్యాంకు రావటంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని భవిష్యరెడ్డి తల్లిదండ్రులు రామిరెడ్డి వ్యవసాయం చేస్తుండగా తల్లి శివపార్వతి జూలకల్లు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిరాలిగా పని చేస్తున్నారు. మెడిసిన్ చదివించాలనే లక్ష్యంతో తమ కుమార్తెను ఆటువైపు ప్రోత్సహించినట్టు తండ్రి రామిరెడ్డి తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థిని భవిష్యరెడ్డిని బంధువులు, గ్రామస్థులు, కళాశాల యాజమాన్యం అభినందించారు.



నాదెండ్ల సమీపంలో రోడ్డుపై గుట్టలుగా వేసిన సుబాబుల్ కర్రలు

ప్రమాదకరంగా సుబాబుల్ గుట్టలు

● ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు

నాదెండ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సుబాబులు కర్రను కొనుగోలు చేసే వ్యాపారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. నాదెండ్ల నుంచి సాతులూరు మార్గమధ్యలో పొలాల్లో కొట్టిన కర్రను ట్రాక్టర్లపై తెచ్చి రహదారుల పైనే నిల్వ చేస్తున్నారు. దీంతో ఆ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు రాత్రి వేళల్లో కనిపించక ప్రమాదాలబారిన పడుతున్నారు. దీనిపై వాహనదారులు ప్రశ్నిస్తే దౌర్జన్యకరంగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.